నవంబర్ - డిసెంబర్ 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



క్రిస్మస్ శుభాకాంక్షలతో....



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రియ సహోదర, సహోదరీలకు నా హృదయపూర్వక వందనములు. దేవుడు ఆయన ఉచితమైన కృప వలన మనలను సంవత్సరాంతములోనికి తీసుకొని రావడం జరిగింది. ఎల్లప్పుడూ ఆయన కృపను గురించి తలంచుకొనుట మనకు ఎంతో ఆశీర్వాదకరము. అందుకే భక్తుడైన దావీదు దేవుని కృపను గూర్చి పాడుకుంటూ, ఆయన కృపను బట్టి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ దేవుని హృదయానుసారుడు అని సాక్ష్యమును పొందాడు.

మనము, మన కుటుంబములు చివరి రెండు నెలలు ఆయన చేసిన మేలులు అన్నింటిని నెమరువేసుకొని, ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరచిపోక ముందుకు సాగిపోవలయును.

నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అబ్రాహాము నిరీక్షణ కలిగి జీవించాడు. అది అతనికి నీతిగా ఎంచబడింది. జీవితములో ఏదో ఒక సమస్య అనేది లేని మనుష్యుడు ఎవరూ ఉండరు అని గ్రహించి మనకు ఎలాంటి సమస్యలు ఉన్నా నిరీక్షణ కలిగి దేవుని వైపు చూస్తూ, ఆయన నిర్ణయకాలములో మనలను ఆ సమస్యల నుండి విడిపిస్తాడు అని విశ్వసించవలయును. అయితే అనేకులు నిరీక్షణ కలిగి ఉండుటకు ఇష్టపడక పోవుట వలన మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టుకొనుచున్నారు. దాని వలన మొదటి స్థితి కంటె మరి చెడ్డ స్థితిలోనికి వెళ్ళుచున్నారు.

స్పర్శ పాఠకులైన మీరందరు  మీరు ఉన్న ఏ పరిస్థితులలోనైననూ దేవునియందు నిరీక్షణ కలిగి జీవించమని ప్రభువు పేరట బ్రతిమాలుచున్నాను.

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 1 నవంబర్ - డిసెంబర్, 2013

# దేవుని స్పర్శ

ఈ సంచికలో...

ఋణవిముక్తి - ఐశ్వర్యప్రాప్తి ..... 2
ఈవెన్ రాబర్ట్స్ (వెల్ష్ ఉజ్జీవం) ..... 5
ఫోర్ (Four) (స్త్రీల ప్రత్యేకం) ..... 6
సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 31వ భాగము ..... 9
నేనెరుగుదును ..... 11
అలంకరణ (బాలల శీర్షిక) ..... 13
నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 15
ప్రణాళిక ..... 17
ప్రార్థనా శక్తి ..... 19
మెగిద్దోలోయ ..... 21
బైబిల్ క్విజ్-31 ..... 22
జన్మదిన శుభాకాంక్షలు ..... 23

మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1 శాంతి నగర్ వాటర్‌ట్యాంకు ఎదురుగా
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040 -2420 2227

# ఋణవిముక్తి - ఐశ్వర్యప్రాప్తి

బ్రదర్. శేఖర్

సగటు మానవుని జీవితమంతా ఋణము - ఐశ్వర్యము అనే రెండు ఆర్థిక అంశముల చుట్టూ పరిభ్రమిస్తుంది అనడములో అతిశయోక్తి ఉండదేమో! జీవిత పోరాటమంతా మొదటి దానికి దూరమై రెండవదానికి దగ్గరవ్వాలనే తపనే. తాహతుకు మించిన అప్పు మనిషి జీవితమును ఎంతగా కృంగదీస్తుందో మనలో చాలమందికి స్వానుభవం. అప్పులపాలై కుటుంబములు ఛిన్నాభిన్నమైన సంఘటనలు మన భారతీయ సమాజములో కోకొల్లలుగా కనబడతాయి. చేసిన అప్పులు తీర్చలేక త్రాగుడికి బానిసలై జీవితాన్ని దుర్భరం చేసుకునేవారు కొందరైతే, నేరస్థులుగా మారేవారు ఇంకొందరు. ఋణవిముక్తులై భాగ్యవంతులవ్వాలని మనలో చాలామంది మెరుగైన సంపాదన కోసం విదేశాలకు వలసపోతూ ఉంటాము. ఆర్థిక క్రమశిక్షణ లేకుంటే విదేశాలలో సంపాదించినా అప్పుల బాధ తప్పదు సుమా!

సరే, ఇప్పుడు ఆర్థిక ఐశ్వర్యం కలిగిన వారి సంగతి చూద్దాం. వారు నిజంగా భాగ్యవంతులా? వారి జీవితం చీకు చింతలు లేకుండా ఆనందమయమై ఉందా?

ఉంటే ఆర్థికంగా సుసంపన్నమైన దేశాల్లో జీవించే ప్రజలు కూడా ఎందుకు నిరాశలకు గురై జీవితాన్ని దుర్వ్యసనములకు బానిసలుగా చేసుకుంటున్నారు?

ప్రతిభావంతులు, ధనవంతులు, ప్రముఖులు, విలాసవంతమైన జీవితమును కలిగి ఉండి కూడా, ఆత్మహత్యతో తమ జీవితమును అంతమొందించుకోవడం మనం తరచుగా వార్తలలో చూస్తున్నాం కదా?



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు బోరిస్ బెకెర్ తన అద్భుతమైన ఆటతో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఎంతో ఖ్యాతి గడించాడు. ఆత్మహత్య చేసుకోవాలనే బలమైన కోర్కెను తాను నియంత్రించుకోలేక పోతున్నానని మీడియా ముందు ఈ విధంగా వెల్లడించాడు. "నేను రెండు మారులు వింబుల్టన్ విజేతనై, మొదటిసారి అత్యంత పిన్న వయస్సులో టైటిల్ సాధించిన వానిగా చరిత్ర సృష్టించితిని. విస్తారమైన ధనసంపదలు కలిగి ఏదీ కొదువలేకయుంటిని. అయితే నా మనస్సులో శాంతి, సంతృప్తి కరువై బానిసవలె జీవిస్తున్నాను". చూశారా, ధనం శరీరమునకు సుఖమును కొనగలదు గాని హృదయానికి సంతోషమును సంపాదించలేదు అని దీని ద్వారా మనకు స్పష్టమవుతుంది.

అప్పు ఉన్నవారు అప్పు తీరిపోతే జీవితమంతా సంతోషమే అనుకుంటారు. కాని ఆ భ్రమలు అప్పు తీరిన కొద్ది కాలమునకే తొలగిపోతాయి. ఐశ్వర్యం పెరిగితే జీవితములో ఆనందం పెరుగుతుంది అనుకునేవారు, ఎండమావి లాంటి ఆనందం ఎంత దూరము వెళ్ళినా స్వంతం కాదని ఆలస్యంగా తెలుసుకుంటారు. ఈ క్రమములో జీవిత చరమ దశకు చేరుకొని, మరణశయ్య మీద ఉండి, ఈ జీవితం వృధా అయిపోయింది, మరణానంతరం నా గమ్యమేమిటి? అని రోదించే వారు ఎందరో కదా! కానీ అప్పటికే సమయం మించిపోతుంది. మరి జీవితములో నిజమైన సంతోష సమాధానములకు మూలం ఎక్కడ దాగి ఉంది? చింత లేని సంతృప్తితో కూడిన జీవితం ఎలా సాధ్యం.

వాస్తవానికి ఆత్మీయ ఋణం – ఐశ్వర్యం అనే రెండు ప్రధాన అంశాలు మన జీవిత గమనాన్ని, గమ్యాన్ని శాసిస్తాయి. లోకములో ఉన్న మనుష్యులంతా ఆత్మీయ దారిద్ర్యంలో మగ్గిపోతూ వారిని సృజించిన ప్రేమామయుడైన దేవుడు వారి కొరకు సిద్ధపరచిన ముక్తి మార్గమును నమ్మలేనివారుగా ఉంటున్నారు. భూమి మీద ఇవ్వబడిన ఒక్క జీవితమును వృధా చేసుకొని తద్వారా శాశ్వతమైన నాశనమునకు పాత్రులవుతూ దేవుడు అనుగ్రహించు శాంతి సమాధానాలను పొందలేకపోతున్నారు. మనం చేసే పుణ్యకార్యాలు నాశనం నుండి తప్పించలేవు ఎందుకంటే మనుష్యుని యొక్క పాపపు స్వభావం, పాపపు క్రియల ద్వారా సంక్రమించిన ఋణం బహు భారమైనది, దాని వెల చెల్లించడం ఏ మనుష్యునికైనా అసాధ్యం. ఉదాహరణకు చెప్పాలంటే మదర్‌తెరీసా చేసిన నిస్వార్థమైన సేవ కూడా ఆమె పాపపు ఋణమును తీర్చలేదు అనేది వాస్తవమైన సత్యం. మరి దేవుడు సిద్ధపరచిన ఉచితమైన ఋణ విముక్తి మార్గం ఏమిటి? దానిని పొందుకోవడం ఎలా?

దేవుడు తన అనాది ప్రణాళిక చొప్పున మనుష్యులను పాపపు శిక్ష నుండి విడిపించి వారికి తన మహిమైశ్వర్యమును ఇచ్చుటకై, తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు శరీరధారిగా అనుగ్రహించాడు. పనికిరాని మనకొరకు, సమస్తానికి వారసుడు, మహిమాన్వితుడు, మహోన్నతుడు అయిన తన కుమారుని సామాన్య మానవునిగా, దాసునిగా పంపించడం ఏ మనుష్యుని ఊహలకందని దేవుని ఉన్నతమైన ప్రేమ! ఇది దేవుని ఆశ్చర్యమైన కృప! క్రీస్తు శకం ఆరంభం, అంటే 2013 సంవత్సరాలకు పూర్వం యేసు మరియ అనే కన్యక గర్భాన పరిశుద్ధాత్మ వలన జన్మించాడు. ప్రపంచమంతా



డిసెంబర్ 25వ తేదీ నాడు ఆయన జన్మదినాన్ని ఘనంగా ఆచరిస్తారు. తన ప్రజలను వారి పాపములనుండి విడిపించడానికి యేసు లోకానికి వచ్చాడని దైవలేఖనాల్లో వ్రాయబడి ఉంది. పవిత్రుడు, పాపమే లేని వాడిగా 33 సం॥రాలు జీవించి తాను వచ్చిన పనిని సిలువలో మరణం ద్వారా సంపూర్ణం గావించాడు యేసు. ఆయన నీ కొరకు శాపగ్రస్తుడిగా సిలువలో వ్రేలాడి, తన అమూల్యమైన, నిష్కళంకమైన రక్తమును కార్చుట ద్వారా నీ పాప ఋణము యొక్క మూల్యమును పూర్తిగా చెల్లించి వేసాడు. సిలువలో మరణించి, మూడవ దినాన తిరిగి సజీవుడిగా లేచాడు !

ప్రియ నేస్తమా! నీ పాప ఋణం ఎంతో భయంకరమైనది. దాని నుండి విముక్తి పొందకుండా నీ జీవితంలో ఎన్ని సిరి సంపదలు ఉన్నా అదంతా నిండు సున్నా. సౌకర్యవంతమైన పడకమీద పడుకొని, దుప్పటిలో విష సర్పాన్ని కలిగి ఉంటే ఎలా ఉంటుందో క్రీస్తు రక్తంలో విమోచించబడని నీ జీవితం కూడా అంతే. యేసు నీ కొరకు చేసిన సిలువ త్యాగాన్ని గ్రహించి, దేవుని ప్రేమ యందు విశ్వాసముంచి, నీ పాపములను ఆయన యొద్ద ఒప్పుకొని క్షమాపణ వేడుకుంటే, నీ జీవితం అద్భుతమైన మలుపు తిరుగుతుంది !యేసు రక్తము ప్రతి పాపమును కడిగి పాపపు దాసత్వము నుండి నీకు సంపూర్ణ విడుదలను ప్రసాదిస్తుంది.

డిసెంబర్ నెల నీ జీవితానికి నాంది పలుకుతుంది, దేవుని నిత్యత్వపు ఐశ్వర్యం నీ స్వంతమవుతుంది! **కాగా ఎవడైననూ క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి ; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను. 2 కొరింథీ 5:17**



**క్రిస్మస్ మరియు**
**నూతన సంవత్సర ఆరాధన**

క్రిస్మస్ ఆరాధన సమయం:
డిసెంబర్ 25,
ఉదయం గం. 10.00 లకు

**నూతన సంవత్సర ఆరాధన సమయం:**
డిసెంబర్ 31,
రాత్రి గం. 9.00 లకు

**వివరములకు:**
9666666249, 040-24202227



# ఈవెన్ రాబర్ట్స్ (వెల్స్ ఉజ్జీవం)

సంఘ చరిత్రలో ఒక గొప్ప ఉజ్జీవం 100 సంవత్సరాల క్రితం మొదలైంది. ఇది 26 సంవత్సరాల వయస్సుగల ఈవెన్ రాబర్ట్స్ ద్వారా 1904లో జరిగింది. వాచ్‌మెన్‌నీ మాటల ప్రకారం ఇది 'సంఘ చరిత్రలోనే అతి గొప్ప ఉజ్జీవంగా పేర్కొనబడింది'. వేల కొద్ది ప్రజలు అతని సమావేశాల్లో పాల్గొన్నారు. ఈవెన్ రాబర్ట్స్ ద్వారా దేవుడు ఆచార కట్టుబాట్లను తెంచాడు. సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి. 'ఎవరూ సమావేశాన్ని నడిపించ వద్దు గాని పరిశుద్ధాత్ముడు నడిపించిన ప్రకారం ప్రతి ఒక్కరూ పాల్గొనాలని' రాబర్ట్స్ ఆదేశించాడు. అతడు కొన్ని ప్రసంగాలు ప్రసంగించాడు కాని పరిశుద్ధాత్మ నడిపింపును వెదికాడు. ఈవెన్స్ ఉపదేశం వేదాంత పరంగా కాదు గాని క్రియాశీలకంగా ఉండేది. అతడు నాలుగు ప్రాధమిక సత్యాలను బోధించాడు. ప్రజలు తమకు తెలిసిన పాపాలన్నిటిని ఒప్పుకోవాలి, అనుమానాస్పదమైన అలవాట్లను విసర్జించాలి, పరిశుద్ధాత్మ ప్రేరేపణకు లోబడాలి, మరియు క్రీస్తును బహిరంగంగా ఒప్పుకోవాలి.

ఉజ్జీవ కూడికలు ప్రార్థన, పాట ఆలపన, ఉపదేశం, ఒప్పుదల, విజ్ఞాపన, కృతజ్ఞతతో సహజసిద్ధంగా మొదలయ్యేవి. పరిశుద్ధాత్ముడు నడిపించేవాడు. పాపులు రక్షించబడ్డారు. జీవితాలు మార్చబడ్డాయి. ప్రజలు పరిశుద్ధాత్మతతో నింపబడ్డారు. 9 నెలల పాటు ఈవెన్ రాబర్ట్స్ వేల్స్‌లో ప్రయాణించి అనేక గనుల పట్టణాలను దర్శించాడు. వేల కొద్ది ప్రజలు అతని సమావేశాలకు వెళ్ళారు. మధ్యపానం, కుటుంబ వేధింపులు అదృశ్యమైనాయి. పాల్గొనేవారు లేకపోవడం వలన రాత్రి క్లబ్బులు, బారులు, థియేటర్లు మూతపడ్డాయి. రాజకీయ సమావేశాల్లో, యూనియన్ హాల్లో హాజరు శాతం పడిపోయింది. అనేక ఆత్మలు దేవుని రాజ్యంలోకి చేరాయి. ఆరాధనా స్థలాలు నిండిపోయాయి. వెల్ష్ గృహాల్లో ప్రార్థన, స్తుతి ప్రతిధ్వనించాయి. వీధులన్ని పాటలను పాడటంతో నిండిపోయాయి.

"ప్రభువా, నన్ను వంచండి. సంఘాన్ని వంచి లోకాన్ని రక్షించండి" అని ఈవెన్ ప్రార్థించడం మొదలుపెట్టాడు. అతడు తన సొంత ఊరిని ఎత్తబడటం దర్శనములో చూసి, తన ఊరిలో ఉన్న ఒక లక్ష మంది ప్రజలు రక్షించబడాలని అతడు ప్రార్థించాడు. "రాబర్ట్స్ పూర్తిగా ప్రతిష్టించుకొన్న వ్యక్తి గనుక అతడు ఒక గొప్ప ఉజ్జీవాన్ని తేగలిగాడు. అతడు దేన్ని పట్టుకోకుండా సమస్తాన్ని విడనాడటానికి సిద్ధపడ్డాడు" అని వాచ్‌మెన్‌నీ చెప్పాడు. తన దర్శనం చేత నడిపించబడిన ఈవెన్ రాబర్ట్స్ పరిశుద్ధాత్మ నింపుదల కోసం అతడు 16 మంది యవ్వనస్థులను గ్రామంలోని ఆరాధన స్థలంలో సమావేశపరిచాడు. మరుసటి రెండు వారాల తరువాత ఒక ఉజ్జీవం – "అన్ని కాలాల్లోకెల్లా అతి గొప్ప ఆత్మీయ మేల్కొవత" వచ్చింది.

తీక్షణమైన ప్రార్థనకు నిన్ను నీవే సమర్పించుకోవడానికి ఇష్టపడుతున్నావా? నీ ప్రార్థన ద్వారా దేవుడు అద్భుతమైన కార్యాలు చేస్తాడని నీవు నమ్ముతున్నావా?

# ఫోర్ (Four)

సాధారణంగా మానవుని జీవితం విచిత్రమైన స్థితిగతుల మధ్య కొనసాగుతుంది. మనుష్యుడు తనను తాను సమర్థించుకుంటూ ఎదుటి వారిని నిందిస్తూ లేక విమర్శిస్తూ బ్రతుకుట జరుగుతుంది.

క్రిస్మస్ అనగానే గుర్తుకు వచ్చేది యేసుక్రీస్తు పుట్టిన దినము. ఆయన పుట్టిన దినం ఎనలేని ప్రాముఖ్యతను కలిగివుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువమంది సెలబ్రేట్ చేసుకునే పుట్టిన దినం ఏదైనా ఉంటే అది డిసెంబర్ 25. అయితే బైబిల్ గ్రంథములో ఆ దినమును గూర్చి ఎక్కడ వ్రాయబడలేదు కాని, ఆ మహనీయుడు పుట్టినరోజును గుర్తించుకొనుటకు మనుష్యులు ఏర్పాటు చేసుకొనిన దినముగా మనము భావించవచ్చు. అయితే ఆయన జన్మించిన వంశావళిని పరిశీలిస్తే కొన్ని అసాధారణమైన సంగతులు మనకు కనిపిస్తాయి. ఆయన వంశావళిలో నలుగురు విలక్షణమైన స్త్రీలు కనిపిస్తారు.

అలనాటి ఇశ్రాయేలీయులు వంశావళికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తారు, అయితే వారి మత ఆచారములకు భిన్నముగా ఈ స్త్రీలు మనకు కనబడతారు. వారిని గూర్చి మనము ధ్యానించుకుందాము.

**1. తామారు :**



ఈమెను గూర్చి బైబిల్ గ్రంథముపై అవగాహన ఉన్నవారికి తప్ప పెద్దగా ఎవరికి తెలియదు. ఆదికాండము 38వ అధ్యాయములో చూస్తే తామారు యూదా అనే వ్యక్తికి కోడలు. యూదా యాకోబు కుమారుడు,అబ్రాహాము ముని మనుమడు. యూదా ఏరు అను తన జ్యేష్ఠ కుమారునికి తామారు అనే స్త్రీని ఇచ్చి వివాహము చేసెను. ఏరు దేవుని దృష్టికి చెడ్డవాడై చనిపోయెను. ఆ దినముల సంప్రదాయం ప్రకారం, యూదా ఓనాను అనే తన మరియొక కుమారుడికి తామారుని ఇచ్చి వివాహం చేసెను, అతను కూడా చనిపోయెను. అప్పుడు తామారు భర్త, పిల్లలు లేక బహు శాపగ్రస్తురాలుగా మిగిలిపోయింది. ఆమె వెళ్ళి తన తండ్రి ఇంట నివసిస్తూ ఉంది. ఆమె మామ అయిన యూదా ఆ ప్రాంతమునకు వచ్చుచున్నాడని తెలుసుకొని అతను వచ్చేసరికి ఆమె ముఖము కనిపించకుండా కప్పుకొని ఆ మార్గములో కూర్చున్నప్పుడు అతను వేశ్య అనుకొని ఆమెతో శయనించెను. ఆమె గర్భవతియై పెరసు, జెరహు అను కవలలను కనెను. ఆ విషయము తెలుసుకొనిన యూదా తామారునకు తన

మూడవ కుమారుని ఇచ్చి వివాహం చేయవలసి యుండగా తాను ఆ బాధ్యతను నెరవేర్చలేదని ఆమె ఈ విధంగా చేసిందని గ్రహించి, ఆమె నా కంటె నీతిమంతురాలు అనెను. ఈ విషయం అంతటిలో మంచి అనేది ఏమీ కనిపించదు. శరీరము యొక్క దౌర్బల్యము మరియు మానవ బలహీనత, ఎంత పాపపంకిలమైన రక్తమాంసముల దేహములో మానవుడు ఉన్నాడో కనబడుచున్నది. దేవుని ప్రేమ ఎంత బలమైనది అనే సందేశం తామారు యేసుక్రీస్తు వంశావళిలో ఉండుట ద్వారా లోకానికి ఇవ్వబడింది.

**2. రాహాబు :**

బైబిల్ గ్రంథములో ఈమెను గురించి వ్రాయబడిన మాట వేశ్య. వేశ్య వృత్తిలో జీవిస్తున్న ఈమె యెహోషువ యెరికోను వేగు చూచుటకు పంపిన మనుష్యులకు సహాయం చేయుట ద్వారా తాను తన కుటుంబము నశించిపోకుండా కాపాడుకోవడం మాత్రమే కాక వేగు చూచుటకు వెళ్ళిన మనుష్యులకు విశ్వాసముతో కూడిన మాటలు చెప్పి దేవుని దీవెన పొందింది. **విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతోపాటు నశింపకపోయెను – హెబ్రీ 11:31** లోకసంబంధముగా చూస్తే ఆమె పేరు ఉచ్ఛరించిన ప్రతిసారి రాహాబు అను వేశ్య అని చెప్పబడింది. కాని ఆమె ద్వారా ఎంతో ఘనకీర్తి కలిగిన దావీదు, అటుతరువాత యేసుక్రీస్తు జన్మించడం మనం చూస్తున్నాము.



**3. రూతు**

ముఖ్యమైన విషయం ఏమిటి అంటే ఈమె కూడా యూదురాలు కాదు. రూతు మోయాబు దేశస్తురాలు. మోయాబు అంటే ఆదికాండము 19వ అధ్యాయంలోనికి వెళితే సొదొమ, గొమొఱ్ఱా అను పట్టణములు నాశనము అయిన తరువాత లోతు అతని కూతుళ్ళు పారిపోయారు, దూరముగా ఒక గుహలో నివసించారు. లోతు కుమార్తెలు ఇద్దరు మనము సర్వలోక మర్యాద చొప్పున పోవుటకు ఏ పురుషుడు ఇచ్చట లేడు అని చెప్పి తండ్రికి ద్రాక్షారసము త్రాగించి అతని వలన సంతానము కలుగచేసుకుందాము అని వారిద్దరు తండ్రితో శయనించారు. పెద్దది కుమారుని కని మోయాబు అని పేరు పెట్టింది, అతడు మోయాబీయులకు మూలపురుషుడు. చిన్నది కుమారుని కని బెన్నమ్మి అని పేరు పెట్టింది. అతడు అమ్మోనీయులకు మూల పురుషుడు. యూదులు ఈ రెండు జాతులను అసహ్యముగా

చూస్తారు. రూతు మోయాబు సంతతికి చెందింది. ఆశ్చర్యకరముగా రూతు, ఇశ్రాయేలీయుల సంతతికి చెందిన బోయజుని వివాహం చేసికొని దావీదు తాతయైన ఓబేదును కనినది. దావీదు ద్వారా యేసుక్రీస్తు వంశావళికి చెందిన స్త్రీగా మారింది.



**4. బత్షెబ :**

ఈ నలుగురిలో చివరిది బత్షెబ. ఈమె ఊరియా భార్య. రాజు అయిన దావీదు ఈమెతో పాపం చేయడం ద్వారా పెద్ద అపాయం సంభవించింది. ఆమె భర్తను రాజు చంపించడం జరిగింది. ఆ తరువాత దావీదు బత్షెబను వివాహం చేసుకున్నాడు, వారికి పుట్టిన మొదటి బిడ్డ చనిపోయిన తరువాత సొలొమోను జన్మించాడు. అతను మహా జ్ఞాని అయిన రాజుగా ప్రసిద్ధి గాంచాడు. కాని అనేకమంది స్త్రీలను వివాహము చేసుకున్నాడు. ఈ కార్యక్రమము అంతా ఎంతో హీనమైన స్థితిని కనపరుస్తుంది. కాని ఒక ముఖ్యమైన విషయాన్ని ఏమిటి అంటే బత్షెబ కూడా యేసుక్రీస్తు వంశావళిలో చేరినది.

పైన ధ్యానించుకున్న నలుగురు స్త్రీల ద్వారా స్వనీతితో కూరుకుపోయిన ప్రతిఒక్కరు ప్రభువు యొక్క కృపను అర్థము చేసుకొని సమాజములో ఏ ఒక్కరిని అసహ్యించు కొనకూడదని తెలుసుకొనవలయును. దేవుని కృప ఎంత ఉన్నతమైనదో అర్థం చేసుకోవడానికి వీరి జీవితములు మనకు ఎంతో అవసరం. **నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను - లూకా 19:10.** దీని ద్వారా సృష్టిలో ఎలాంటి మనుష్యుడైనా, ఎంత అధమ పరిస్థితులలో ఉన్నా, నాకు కూడా నిరీక్షణ ఉంటుందా? నాలాంటి వాళ్లు కూడా దేవుని దగ్గరకు రావచ్చా? ఇలాంటి స్థితిలో ఉన్న నేను ఏ ముఖం పెట్టుకొని దేవుని దగ్గరకు రావాలి అనే సంశయాలు, సందేహాలు పెట్టుకోవడానికి అవకాశం లేకుండా ఊహకు అందని విధంగా యేసు క్రీస్తు జననం విషయంలో తండ్రియైన దేవుడు తన ప్రణాళికను జరిగించడం గమనించవచ్చు.

ఈ క్రిస్మస్ దినాలలో మనలో స్వనీతి, సందేహాలు, సంశయాలు విడిచి ప్రభువును ఆరాధించుటలో ఆయన యొద్దకు వచ్చుటలో ముందుకు కొనసాగుదాం.

అట్టి కృప మీకు కలుగును గాక !



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 31వ భాగము**

ఉపవాసం వలన కలిగే లాభములన్నీ ఆ తరువాతే సుందర్‌కు తెలిశాయి. అయితే ఉపవాసమునకు పూర్వం తనని ఎంతో ఆశ్చర్యపరచిన విషయములపై ఉపవాస దినములలోనే ఎంతో అవగాహన కలిగించింది. తనలో నిబిడీకృతమైయున్న శక్తి వలననే తనకీ సంతోష సమాధానములు దొరికాయేమోనని సుందర్ సందేహించిన సందర్భములు లేకపోలేదు. విశ్వంలోని శక్తులు దైవసమానమని భావించే ఈ అద్వైతతత్వం ఎన్నో సార్లు సుందర్‌లో తన ఉనికిని చూపెట్టింది. అడవిలో ఒంటరిగా నుండి అంతకంతకు బలహీనుడగుచుండినప్పుడు అంతరంగములో అంతవరకు తగ్గిపోవుచుండిన సమాధాన సంతోషాలు ఎక్కువైపోయాయి. దానితో ఈ శాంతి పరలోకం నుండి కలిగినదే గాని తనలో నున్న సహజ శక్తుల ద్వారా ఉద్భవించినది కాదని సుందర్‌కు తేటగా తెలిసిపోయింది. అతని ఆత్మ విషయములోను ఇలాగే జరిగింది. మనం చనిపోతే ఆత్మపై దాని ప్రభావమెలా ఉండును అని పరిశీలించి నప్పుడు అతని శారీరక, మానసిక శక్తులు బలహీనమై పోవుచుండగా తనలో ఉన్న ఆత్మ సంబంధమైన శక్తులు అంతకంతకు చురుకైపోవడానికి సుందర్ గమనించాడు. ఆ తరువాత దీనిని వివరిస్తూ మెదడు అనేది ఆత్మ పనిచేసే ఒక కార్యాలయం, ఇంకో రకంగా చెప్పాలంటే మెదడు అనేది సంగీత విద్వాంసుడు వాయించే ఒక వాద్య పరికరం లాంటిది. దానిలో ఒకటి రెండు అపస్వరాలు పలికినంత మాత్రాన ఆ వాద్యకారుడు లేడు అనుకోకూడదు.

ఆధ్యాత్మిక ప్రశ్నలకు జవాబు పొందడం కంటే కూడా తన నడవడికపై ఉపవాస ప్రార్థన చూపిన ప్రభావ విషయములో ఎంతో సంతోషించాడు. సాధువు జీవితమునకు స్వస్తి పలికి సాధారణ గృహస్తుని వలె జీవితం గడపాలన్న శోధనకు తనపై ఎలాంటి ప్రభావము లేకుండా పోయింది. ఇతరులు సౌకర్యమును, డబ్బును, గృహమును కలిగియుండడములో ఎలాంటి పాపము లేదు గాని నా యెడల దేవుని పిలుపు వ్యత్యాసమైనదిగా చూస్తున్నానని సుందర్ చెప్పాడు. ఎదురు తిరిగే మనస్తత్వంపై కూడా ఈ ఉపవాసం ఎంతో ప్రభావమును చూపింది. ఉపవాస ప్రార్థనకు పూర్వం ఆకలి దప్పులతో ఉన్నప్పుడు లోలోపలే నిందుంచుకుంటూ ఉండేవాడు. ఆహారమును, పానీయమును దేవుడు ఎందుకు

సమకూర్చుకూడదు, డబ్బు తీసుకొని పొమ్మని ఎందుకు చెప్పకూడదు ? చేతిలో డబ్బు ఉంటే నాకు అవసరమైన వాటిని కొనుక్కొని ఉండేవాడిని గదా. ఇప్పుడు నాకు భోజనం కావాలి అని తనలో తానే నిందించుకుంటూండే వాడు. అయితే ఆ ఉపవాస ప్రార్థన తరువాత కష్టములను ఎదుర్కొన్న ప్రతిసారి "ఇది నా తండ్రి చిత్తమంటూ" ఎలాంటి సణుగు లేకుండ వాటిని అంగీకరించే వాడు. అంతకు ముందు కంటే తాను ఎంతో ఉన్నతమైన స్థితిలో జీవిస్తున్నట్టుగా గమనించుకొన్నాడు. అతనిలో ఉండే చికాకు కూడా తగ్గిపోయింది. అలసిపోయినప్పుడును, ప్రజలు తనను ఎన్నెన్నో ప్రశ్నలడిగినప్పుడును ఈ చికాకు స్వభావం బయటపడుచుండేది. దానికి తానెంతో బాధపడుచుండేవాడు. ఆ చికాకును దాచుకోవడానికి ఎంతో ప్రయత్నించేవాడు. అయితే ఉపవాస ప్రార్థన తరువాత కూడ ఆయనలో ఈ చికాకు స్వభావముండినది గాని అంతకు ముందు ఉన్న తీవ్రస్థాయిలో మాత్రం కాదు.

1913 మార్చి 13న సుందర్ సిమ్లా వచ్చినట్లుగా అతని స్నేహితుడు, న్యూజిలాండ్ దేశీయుడైన టి.ఇ రిడ్లీ గారు తన డైరీలో వ్రాసుకున్నారు. సుందర్ మరల సిమ్లా వచ్చాడు. ఇప్పుడు టిబెట్ ప్రాంతమునకు బయలుదేరాడు. ఆ పర్వత ప్రాంతములకు వెళ్ళి సువార్త నందించాలన్న తృష్ణ అతనిలో రగులుచునే ఉంది. మంచు కరిగే దినములలో ఏర్పడే మార్గముల ద్వారా టిబెట్ చేరడానికి వీలుగా జనసమ్మర్ధంగా ఉన్న పట్టణములో అతడు సువార్త ప్రకటించాడు. సువార్త ప్రకటన కార్యక్రమమును యధావిధిగానే నిర్వహిస్తూ 14 నెలలు ప్రయాణం చేసి 1914 మే నెల ఆఖరుకు నేపాల్ సరిహద్దుకు చేరాడు సుందర్. అనుమతి పత్రం లేకుండా హైందవరాజ్యమైన నేపాల్‌లో ప్రవేశించడం ఎంతో కష్టం. అలాంటిది ఒక క్రైస్తవునికి అనుమతి దొరకడం మరింత కష్టం. సుందర్ నేపాల్‌లోనికి ప్రవేశించడానికి ముందు సరిహద్దు కాపలాదారులు రెండు సార్లు అతనిని అడ్డగించారు. అయితే ఒక్కసారి నేపాల్‌లోనికి ప్రవేశించగానే తాను ప్రయాణించుచుండిన గ్రామములోని వారు తనను సాదరంగా చేర్చుకోవడంతో అతడు ఎంతో ప్రోత్సాహం పొందాడు. సుందర్‌కి నేపాలీ భాష అర్థమైనప్పటికిని ఆ భాషలో ధారాళంగా మాట్లాడలేడు గనుక ప్రజలతో సంభాషించటం కష్టమని తలంచి నేపాలీలో ఉన్న క్రొత్తనిబంధనను బిగ్గరగా చదివి వినిపిస్తుండేవాడు.

ఇంకా ఉంది (సేకరించబడింది )

# నేనెరుగుదును

2013వ సంవత్సరము మరికొన్ని దినములలో మనలను విడిచి వెళ్ళిపోవుచున్నది. 2014 మనలను పలకరిస్తుంది. సంవత్సరము వెంబడి సంవత్సరము వచ్చుచుండగా అనేక సందర్భాలలో జీవితం ఎటు వెళుతుందో తెలియని పరిస్థితులు కనబడుతున్నాయి అని కొందరు, ఏమి చేయాలో పాలుపోవటం లేదని మరికొంతమంది, నాలాంటి పరిస్థితులు ఎవరికి వద్దు అని ఇంకొందరు ఇలా ప్రతి మనుష్యుడు ఏదో విధంగా ఎప్పుడో ఒకప్పుడు తన జీవిత బాధలను వ్యక్తపరుస్తాడు.

ఇలాంటి పరిస్థితిలో ఉన్న ప్రతి వ్యక్తికి బైబిల్ గ్రంథములో దేవుడు చక్కని మాటలను వ్రాయించాడు. **ప్రకటన 2:9,10 - నీ శ్రమను దరిద్రతను నేనెరుగుదును, అయినను నీవు ధనవంతుడవే ;తాము యూదులమని చెప్పుకొనుచు, యూదులు కాక సాతాను సమాజపు వారివలన నీకు కలుగు దూషణ నేనెరుగుదును. నీవు పొందబోవు శ్రమలకు భయపడకుము. ఇదిగో మీరు శోధింపబడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవుచున్నాడు; పది దినములు శ్రమ కలుగును; మరణమువరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదను.**

**1. నీ శ్రమను ఎరుగుదును :**

దేవుడు ఆయన బిడ్డలమైన మన జీవితంలో సంభవించే ప్రతి వేదనకరమైన స్థితిని నేను ఎరుగుదును అంటున్నాడు. కుటుంబములో మార్పులేని సభ్యులను బట్టి లేక పని చేస్తున్న స్థలములలో మరియు మన శరీర అనారోగ్యము వలన కలుగుచున్న శ్రమంతటినిబట్టి సహాయము చేయుటకు సమస్తమును ఎరిగియున్నాడు. **శ్రమలో నేనతనికి తోడైయుండెదను, అతని విడిపించి అతని గొప్ప చేసెదను అని దేవుడు మనకు సెలవిచ్చుచున్నాడు - కీర్తన 91:15**

**2. నీ దరిద్రతను ఎరుగుదును అయినను నీవు ధనవంతుడవే :**

మనము దరిద్రతలో ఉన్నది ఆయన ఎరిగి ఉన్నాను అని చెప్పుచున్నాడు. అయితే ఆయనను విశ్వసించిన మనుష్యుడు ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికి అతను ధనవంతుడే అని వ్రాయబడి ఉన్నది. అయితే భూమి మీద ఎంత ధనవంతుడైన దేవుని ఎరుగక ఉంటే అతడు నిజమైన ధనవంతుడు కాదు. మన జీవితంలో ఆర్థికంగా ఎలాంటి పరిస్థితులలో ఉన్నప్పటికి అధైర్యపడకూడదు, ఎందుకంటే ఆ విషయం ఆయనకు తెలుసు. తప్పక ఒక పరిష్కారం ఆయన వలన మనకు దొరుకుతుంది.

**3. నీకు మనుష్యుల వలన కలుగు దూషణ నేనెరుగుదును :**

ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం, జీవితంలో ముందుకు వెళ్ళే ప్రతి ఒక్కరికి ఇది అనుభవమే. మన అనుదిన జీవితంలో ఇతరుల వలన కలిగే దూషణలను గురించి ఎన్నడు కృంగిపోకూడదు, నిరాశ చెందకూడదు అని దేవుని వాక్యం అనేక సందర్భాలలో హెచ్చరించుచున్నది. **నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును - మత్తయి 5:11**


మనుష్యుల వలన కలుగు దూషణ విషయంలో కూడా దేవుడు నేను ఎరుగుదును అని చెప్పుచున్నాడు కనుక ఇది దేవుని ప్రణాళికలో భాగమే కాని మరియొకటి కాదు. జీవితంలో ప్రతి ఇబ్బంది వెనుక దేవుని ఉన్నతమైన ఉద్దేశం ఉంటుంది అనే సంగతి మనం మరచిపోకూడదు.

**4. భయపడకుము :**

శ్రమను, దరిద్రతను, దూషణలను నేను ఎరుగుదును అని చెప్పిన దేవుడు చివరిగా భయపడవద్దు అని మనలను ప్రోత్సహించుచున్నాడు. నిజమే కదా ఆయన భయపడవద్దు అన్న తరువాత మనము ఎందుకు అధైర్యపడాలి. ఆయన పరిశుద్ధ గ్రంథములో వ్రాయించిన మాటలు సర్వసృష్టిలో ఉన్న సర్వమానవాళికి ఎంతో ఉపయోగకరమైనవి అనే సంగతి గ్రహించాలి. **సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింప గలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును - 1 కొరింథీ 10:13** తప్పక ప్రతి పరిస్థితిలో నుండి బయటపడే మార్గము ఆయన మన కొరకు సిద్ధపరిచాడు.

ప్రియ సహోదరుడా, సహోదరి మన జీవితములో ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులు సంభవించిననూ, దేవుడు వాటినన్నింటిని ఎరిగి ఉన్నాడని, వాటన్నింటిలో నుండి మనలను విడిపిస్తాడనిమనము విశ్వసించవలయును. అట్టి విశ్వాసము మనలను ధైర్యముతో ముందుకు కొనసాగుటకు ప్రయోజనకరమగును.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !



# అలంకరణ

ఏంటి? ఎలావున్నారు? మిమ్మలనందరిని కలవాలని ఉంది, కాని కుదరదు. ఒక్కొక్కరము ఒక్కొక్క ప్రాంతములో వుంటాము. ఖచ్చితముగా ఒక దినమున సాధ్యమవుతుంది, అది దేవుని రాజ్యములో. ఇన్ని సంవత్సరములనుండి ఎన్నో విషయములను మీకోసం నేను వ్రాస్తున్నాను, మీలో ఎంత మంది నాకు ఒక్క ఉత్తరమైనా వ్రాసారా? ఈసారి నా అడ్రస్ క్రింద ఇస్తాను, మీ సూచనలు, సలహాలు తప్పక నాకు తెలియపరుస్తారుగా!

మీకు ఒక విషయం చెప్పనా! మీకోసం వ్రాసిన స్టోరీలను పెద్దవాళ్ళు కూడా ఎప్పుడు చదవాలా అని ఎదురుచూస్తారు తెలుసా? సరే, చలికాలం వచ్చింది చలిలో ఇష్టం వచ్చినట్లు తిరగకండి. మీ ఆరోగ్యం జాగ్రత్త. ఇంకా అక్కయ్య స్టోరీ మొదలు పెట్టలేదేంటా? అనుకొంటున్నారా? అక్కడికే వస్తున్నా.

అనగనగా ఒక ఊరిలో రాజుగారు ఉండేవారు. అన్ని రాజ్యాలలో తన రాజ్యం గొప్పదిగా గుర్తించబడాలని తెగ తాపత్రయ పడేవారు. ఒక సంవత్సరం క్రిస్మస్ పండుగ దగ్గర పడుతుంటే రాజుగారికి ఒక ఆలోచన వచ్చింది. అన్ని రాజ్యాల కన్నా తన రాజ్యంలో పండుగ బాగా జరిగింది అనిపించుకోవాలని ఒక పోటీ ప్రకటించారు. రాజ్యంలో అందరికన్నా ఎవరు బాగా "క్రిస్మస్‌ట్రీ" పెట్టి స్టార్ కడతారో వారికి రాజుగారు స్వయంగా బహుమానం ఇస్తారని రాజ్యమంతటా దండోరా వేయించారు. రాజ్యంలో ప్రజలంతా పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకర్నిమించి ఒకరు ఎంతో శ్రద్ధతో క్రిస్మస్ ట్రీ లను అలంకరించి వారి వారి ఇండ్లపై స్టార్‌లను కట్టడం జరిగింది.

ఒకరోజు సాయంకాలం రాజు, రాణి తన పరిచారకులతో రాజ్యమంతటా పర్యటించారు. ఎంతో అద్భుతంగా అలంకరించబడిన ఎన్నో ఇండ్లను చూసి చాలా సంతోషించారు. వారు వెళ్తూ ఉండగా మార్గంలో ఒక ఇల్లు ఎలాంటి అలంకరణ లేకుండా కనిపించింది.

రాజుగారు ఆ ఇంటిని చూచి ఈ ఇంట్లో ఎవరు ఉంటారు ఎందుకు అలంకరించుకోలేదని ఆ ఇంటివైపు అడుగులు వేశాడు. ఆ ఇంట్లో వృద్ధాప్యంలో ఉన్న భార్యాభర్తలు చాలా హడావిడిగా ఆహారాన్ని సిద్ధపరచటం కనిపించింది. అది చూసి రాజుగారు అయ్యా మీరు ఏంచేస్తున్నారు, మీ ఇంటిని ఎందుకు అలంకరించుకోలేదు అని

అడిగాడు. మేము మా దగ్గర ఉన్న కొద్ది డబ్బులుతో తల్లిదండ్రులులేని పిల్లలకి, దిక్కులేని వృద్ధులకు ప్రతి దినమూ ఆహారమును అందించటం జరుగుతుంది అని చెప్పారు. జవాబు విన్న రాజు నిశ్చేష్టుడయ్యాడు. రాజ్యాన్ని పరిపాలించడమంటే పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం కాదని, ప్రజల అవసరతల విషయంలో బాధ్యత కలిగి ఉండటం అని గుర్తించాడు. రాజుగా తన బాధ్యతని, తాను చేయవలసిన పనిని వృద్ధాప్యంలో ఉన్నవారు నెరవేర్చటం గమనించి సిగ్గుపడ్డాడు. తన తప్పుని గ్రహించి క్రిస్మస్ అలంకరణల కోసం కాదని నిజమైన క్రిస్మస్ తన పొరుగువారిని తనవలె ప్రేమించాలని గ్రహించాడు. తనకు కను విప్పు కలిగించిన ఆ వృద్ధదంపతులకు మంచి బహుమానం ఇచ్చి సత్కరించాడు. ఆనాటి నుండి వృద్ధదంపతులు తీసుకున్న బాధ్యతను తన అంతఃపురములో పనివారికి అప్పగించాడు. అలాగే రాజ్యములో ఉన్న ప్రజలందరికి ఈ విషయాన్ని చాటింపు వేయించాడు.

పిల్లలూ! మనకి కూడా క్రిస్మస్ సీజన్ వచ్చేస్తుంది కదా! ఈ సారి క్రిస్మస్‌కు అలంకరణలకి ఇచ్చే Importance తగ్గించి, బీదలైన వారికి సహాయం చేయడానికి ready అవ్వమని మీకు జ్ఞాపకం చేస్తున్నాను. అలా చేస్తారుగా!

– మీ అక్కయ్య.

అడ్రస్: దేవుని స్పర్శ చిల్డ్రన్ కాలమ్స్,ప్లాట్ నెం. 1, శాంతి నగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్–500070


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే....!**

**వివరములకు:**
9666666249 | 040-24202227


 ఇతరులు చేసిన ఏనుగంత తప్పును ఆవగింజంత చిన్నదిగా చూడు. నువ్వు చేసిన చిన్న తప్పును కొండంత తప్పుగా భావించు

# "నా జీవితములో దేవుని మేలులు"

ఎన్. జాన్‌పాల్, ముకుందాపురం

నా జీవితములో దేవుడు జరిగించిన అద్భుతములను గురించి మీ అందరితో పంచుకునే అవకాశం నాకు కలిగినందుకు ఎంతో సంతోషించుచున్నాను.

నల్గొండ జిల్లా నూతనకల్ మండలము ముకుందాపురం గ్రామములో పుట్టిన నన్ను కూడా దేవుడు ఎరిగియున్నాడని, ప్రేమిస్తున్నాడని తలంచినప్పుడు ఆయనను స్తుతించకుండా ఉండలేను. 14 సం॥ముల క్రితం యేసుప్రభువు ఎవరో నాకు తెలియదు, మా తల్లిదండ్రులు, తాతముత్తాతలు ఏది దైవము అని చెబితే దానినే పూజించుట, ఆరాధించుట జరిగేది. ఏనాడూ వ్యక్తిగతంగా అస్సలు దేవుడు ఎవరు ? అని ఆలోచించలేదు. పెద్దలు చెప్పిన దానిని బట్టి వారములో 4 రోజులు ఉపవాసముండి, నేను ఎరుగని వాటిని ఆరాధిస్తూ జీవించేవాడిని. ఆ సమయములో నా భార్యకు కాలు పైభాగం  వాచింది, భరించలేనంత నొప్పి. ఎన్ని హాస్పిటల్స్‌కి తీసుకువెళ్ళినా తక్కువ కాలేదు. ఎవరో వచ్చి చేతబడి అని చెప్పడంతో భూతవైద్యుల దగ్గరకు తీసుకువెళ్ళాను, ఫలితం లేదు. 20 రోజులు గడిచేసరికి నా భార్య చనిపోయే పరిస్థితిలోనికి వచ్చింది. ఆ సమయములో మా ఊరిలో ఒక వ్యక్తి యేసుక్రీస్తుని గురించి చెప్పాడు. అప్పుడు ఊరిలో ప్రార్థన జరుగుతున్న స్థలం దగ్గరకు తీసుకువెళ్ళాను. దేవుడు వారి ప్రార్థనలు ఆలకించి, స్వస్థపరిచాడు. నాకు, నా భార్యకి యేసయ్య మీద విశ్వాసం కలిగింది. ఇంతలో ఆర్థిక ఇబ్బందుల వలన హైదరాబాద్ వలస వచ్చాము. ఆ దినములలో మమ్ములను ఆత్మలో సరిగా నడిపించే వారు లేక బాధ్యతల గురించి తెలియక అన్ని విధాలుగా కృంగిపోయాము. భవిష్యత్ ఏమవుతుందో తెలియక ఆందోళనతో జీవిస్తున్న సమయములో ఎపఫ్రా మినిస్ట్రీస్ పరిచయం అవడం జరిగింది.

ఒకరోజు దైవసేకులను కలిసి నా పరిస్థితి అంతా చెప్పడం జరిగింది. అప్పుడు నన్ను ధైర్యపరిచి, దేవుడు తప్పకుండా సహాయం చేస్తారు అని చెప్పారు. ఒకరోజు మట్టి పనికి వెళ్ళాను. ఈ పని నువ్వు చేయలేవు అని అవమానించి పంపించివేశారు. ఏడుస్తూ ఇంటికి వెళ్ళాను. అలాంటి పరిస్థితులలో నుండి 30 మందిని పెట్టుకొని పని చేయించే వాడిగా దేవుడు నన్ను చేశాడు. 2007వ సం॥లో ఒక ఉపవాస ప్రార్థన జరుగుచున్నప్పుడు హైదరాబాద్‌లో ఇల్లు కావాలని ప్రార్థన చేసుకున్నప్పుడు 2009లో స్థలం కొనుక్కొని, 2010లో ఇల్లు కట్టుకోవడానికి దేవుడు సహాయం చేశారు. నా భార్యకి అనారోగ్యం వచ్చి, హాస్పిటల్‌కి వెళ్తే 5 రోజులలో ఆపరేషన్ చేయకపోతే చనిపోతుంది అని చెప్పారు. దైవసేవకులకు ఈ విషయం చెప్పి ప్రార్థన చేయించుకున్నాము. తరువాత ఆపరేషన్

లేకుండా దేవుడు మంచి ఆరోగ్యం ఇచ్చారు.

సంఘములో ఒక అవయవముగా ఉండుట ద్వారా ఆరోగ్య, ఆర్థిక విషయములలో మాత్రమే కాక, ఆత్మీయ విషయములలో ఒక ఉన్నతమైన స్థితికి నడిపించిన దేవునికి ఏమి ఇచ్చిననూ ఋణమును తీర్చుకోలేము. నా తుది శ్వాస వరకు నా కుటుంబము, నేను ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో నిలిచి ఉండాలని నా కొరకు ప్రార్థన చేయండి.

**ముఖ్య గమనిక :-** మన పెద్దలు, తల్లిదండ్రులు చెప్పారని తెలియని దానిని ఆరాధించడాన్ని విడిచి, మనలను సృష్టించిన సృష్టికర్త, మన జీవితమునకు అవసరమైన శాంతి సమాధానమును, మరణించిన తరువాత మన ఆత్మకు అవసరమైన మోక్షమును అనుగ్రహించేది ఎవరో తెలుసుకొని, ఆయనను నమ్ముకొని, ఆయన కొరకు జీవించమని కోరుకొనుచున్నాము.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# ప్రణాళిక

| సంవత్సరానికి | తర్ఫీదు పొందే వ్యక్తులు |
|---|---|
| 1వ సంవత్సరం | 2 |
| 2 | 4 |
| 3 | 8 |
| 4 | 16 |
| 5 | 32 |
| 6 | 64 |
| 7 | 128 |
| 8 | 256 |
| 9 | 512 |
| 10 | 1024 |
| 11 | 2048 |
| 12 | 4096 |
| 13 | 8192 |
| 14 | 16,384 |
| 15 | 32,768 |
| 16 | 65,536 |
| 17 | 1,31,072 |
| 18 | 2,62,144 |
| 19 | 5,24,288 |
| 20 | 10,48,576 |
| 21 | 20,97,152 |
| 22 | 41,94,304 |
| 23 | 83,88,608 |
| 24 | 1,67,77,216 |
| 25 | 3,35,54,432 |
| 26 | 6,71,08,864 |
| 27 | 13,42,17,728 |
| 28 | 26,84,35,456 |
| 29 | 53,68,70,912 |
| 30 | 107,37,41,824 |
| 31 | 214,74,83,648 |
| 32 | 429,49,67,296 |
| 33 | 858,99,34,592 |

భూమి మీద ఉన్న ప్రతి మనుష్యుడు ఆయనను గురించి తెలుసు కొని, ఆయన యందు విశ్వాసము ఉంచి, ఆయన సిద్ధ పరిచిన పరలోక రాజ్యమును చేరాలని దేవుని యొక్క ఉద్దేశ్యము.

అందుకే నిజదేవుడైన యేసు క్రీస్తుని ఎరిగిన ప్రతి ఒక్కరు వారు ఎరిగిన సత్యమును ప్రతి మనుష్యునికి తెలియపరచాలని ప్రయత్నం చేస్తారు. దీనిని చూస్తున్న వారికి కొన్నిసార్లు కోపం కూడా వస్తూ ఉంటుంది. ఇది మతమును మార్చడం కాదు కానీ, మనిషి హృదయమును మార్చగలిగిన దేవుని మార్గమును చూపించుట. ఇదే విషయాన్ని బైబిల్ గ్రంథములో చూడవచ్చు. **"మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి" (మత్తయి 28:19).** ఈ ప్రక్కన ఉన్న పట్టిక ద్వారా కేవలం 33 సం॥ములలో ప్రపంచములో ఉన్న జనాభా అంతటికి యేసుక్రీస్తుని పరిచయం చేయటం సాధ్యమవుతుంది.

ఒక మనుష్యుడు ఒక వ్యక్తికి ఆయనను గురించి తెలియ పరచడానికి ఒక సంవత్సర కాలమును వెచ్చిస్తే, రెండవ సం॥ములో ఆ ఇద్దరూ కలిసి మరొక ఇద్దరికి దేవుని గురించి

పరిచయం చేస్తే, ఆ నలుగురూ కలిసి మూడవ సం॥ములో మరియొక నలుగురికి ఆ ప్రేమ మార్గమును చూపిస్తే, ఈ విధంగా హెచ్చువేత వలె విస్తరించే గొలుసుకట్టు విధానం ద్వారా 33 సంత్సరములలో ఎంతమందికి ఆ మార్గము పరిచయం అవుతుందో గమనించవచ్చు.


ఈ జనాభా సంఖ్య ప్రపంచ జనాభా కంటే ఎక్కువ. కాబట్టి ప్రతి బాధ్యత కలిగిన వ్యక్తి మరియొకరికి దేవుని మార్గమును చూపించడానికి శ్రద్ధ కలిగి ఉండవలెను.

**"అటు తరువాత నేను చూడగా, ఇదిగో ప్రతి జనములో నుండియు ప్రతి వంశములో నుండియు ప్రజలలో నుండియు, ఆయా భాషలు మాటలాడు వారిలో నుండియు వచ్చి ఎవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము కనబడెను. వారు తెల్లని వస్త్రములు ధరించుకొన్నవారై, ఖర్జూరపు మట్టలు చేతపట్టుకొని సింహాసనము ఎదుటను గొర్రెపిల్ల యెదుటను నిలువబడి (ప్రకటన 7:9)**

**కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని ఇచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు**

**(2 పేతురు 7:9)**

ఈ వాక్యములు నెరవేరునట్లుగా ప్రతి వ్యక్తి బాధ్యతగా మరియొక వ్యక్తికి దేవుని మార్గమును పరిచయం చేయవలెను. ఏ విధము చేతనైననూ లోకమందంతట జీవిస్తున్న ప్రజలు నిజదేవుడు, మానవుల రక్షకుడూ అయిన ఆయనను తెలుసుకొనవలెనని ప్రార్థన చేద్దాము.



# ప్రార్థనా శక్తి

## కృతజ్ఞతాస్తుతులు

స్తుతి దేవుని క్రియలకు, ఆరాధన ఆయన వ్యక్తిత్వమునకు సంబంధించినవై యున్నవి. కృతజ్ఞతాస్తుతి అనగా ఆయన క్రియలను మరియు వ్యక్తిత్వమును కృతజ్ఞతతో ఒప్పుకొనుట. ఇది ఈ క్రియలను ఎరుగుట కాదు కాని, కృతజ్ఞతతో ఎరుగుట. ఇది యథార్థమైన, మనఃపూర్వకమైన అభినందనను వ్యక్తపరచుటయై యున్నది.

కృతజ్ఞతాస్తుతి అనునది మన హృదయలోతులలో మనమేమైయున్నామో అందులో భాగమైయున్నది. ఇది కల్పించినది కాకుండా, పవిత్రంగా, సహజంగా మన హృదయముల నుండి ప్రవహించునదిగా ఉండాలి. కృతజ్ఞత కలిగి ఉండడమంటే, మన కొరకు దేవుడు ఇంకా ఏమైనా చేయునట్లుగా, లేక దేవుని సంతోష పరచునట్లుగా దినాంతములో కూర్చుని ఆ రోజు దేవుడు చేసిన మేలులు జ్ఞాపకం చేసుకొనుట కాదు కానీ దానికి బదులుగా, మన జీవితములలో దేవుని క్రియలకు స్పందించే హృదయమును కలిగి ఉండడం. మన జీవితములలో ఆయన క్రియ చేయుట లేక ఆశీర్వదించుట చూచిన ప్రతిసారి ప్రార్థనలతో ఆయనకు కృతజ్ఞతలు చెప్పుటయైయున్నది. ఉదాహరణకు "తండ్రీ, ఈ దినం మంచి నిర్ణయములను తీసికొనుటకు నాకు సహాయం చేసినందుకు వందనములు లేక నన్ను ప్రోత్సాహపరచినందుకు వందనములు". దేవుడు మన యెడల ఎల్లప్పుడూ మంచివాడు, నమ్మదగినవాడై యుండి, మన జీవితములలో ఎల్లప్పుడూ శ్రద్ధ కలిగి పని చేయుచున్నాడు. ఆయన ఎల్లప్పుడూ మన కొరకు ఏదో ఒకటి చేస్తూ ఉన్నాడు. కాబట్టి మనం ప్రతిస్పందించి, ప్రతిదానికి మన అభినందనను ఆయనకు తెలియజేయాలి. మనం మౌనంగా హృదయములలో ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయవచ్చు, బిగ్గరగా కూడా తెలియజేయవచ్చు, దేవుని స్తుతించమని, ఆరాధించమని బైబిల్ సూచిస్తున్నట్లే మన కృతజ్ఞతను ఆయనకి ఎలా తెలియజేయాలో బోధిస్తుంది.

- **"దేవా, మేము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. నరులు నీ ఆశ్చర్యకార్యములను వివరించుదురు." (కీర్తనలు 75:1)**

- **"యెహోవాను స్తుతించుట మంచిది. మహోన్నతుడా, నీ నామమును కీర్తించుట మంచిది." (కీర్తన 92:1)**

- **కృతజ్ఞతాస్తుతులతో ఆయన సన్నిధికి వచ్చెదము. కీర్తనలు పాడుచూ ఆయన పేరట**

సంతోషగానము చేయుదము (కీర్తన 95:2)

- **“కృతజ్ఞతార్పణలు చెల్లించుచూ ఆయన గుమ్మములలో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములలో ప్రవేశించుడి, ఆయనను స్తుతించుడి, ఆయన నామమును ఘనపరచుడి” (కీర్త 100:4)**

**ఇది దేవుని చిత్తము :-**

అనేకమంది క్రైస్తవులు దేవుని చిత్తమును తెలుసుకోవాలని అనుకుంటుంటారు. ప్రజలు తమ వ్యక్తిగత జీవితములలో, కుటుంబములలో, పరిచర్యలలో, భవిష్యత్‌ల పట్ల దేవుని చిత్తమును తెలిసికొనుటకు చాలా ఆసక్తి కలిగి ఉంటారు. కొన్నిసార్లు మనుష్యులు దేవుని చిత్తమును ప్రపంచములో కెల్లా చిక్కుతో కూడిన మర్మముగా భావించి “నేను దేవుని చిత్తమును తెలుసుకొని ఉన్నట్లయితే, లోబడతాను”, నాకు ఆయన చిత్తమేమిటో ఖచ్చితంగా తెలియటం లేదు”, అని మాట్లాడుతూ ఉంటారు. అయితే మన జీవితములో దేవుని చిత్తమును తెలుసుకొని, లోబడి ఉండుటకు ఖచ్చితమైన మార్గం - కృతజ్ఞత కలిగి ఉండడం. మనం ఉన్న పరిస్థితితో సంబంధం లేకుండా, అన్ని సమయములలో - కృతజ్ఞత కలిగి ఉండుట, ఇది సరియైనది.

ప్రతి పరిస్థితిలో కృతజ్ఞతతో కూడిన హృదయమును కలిగి ఉండాలి. కొన్నిసార్లు కృతజ్ఞత సులువుగా వస్తుంది, కొన్నిసార్లు కష్టమైనది. అయితే కృతజ్ఞత భావనను అభివృద్ధి చేసుకొని, నిలిచి ఉన్నట్లయితే దేవుని చిత్తములో ఉన్నట్లే. “ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి, ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము”.

ప్రతి విషయములో కృతజ్ఞత కలిగి ఉండడం అంటే మన ప్రతిదిన దీవెనలను బట్టి - మన ఆరోగ్యం, పనులు చేసికొనుటకు మన సామర్థ్యం, వీటిని బట్టి వందనములు చెల్లించుట. మన జీవితములలో ఆయన మనకి అనుగ్రహించిన మనుష్యులను బట్టి అనగా మనతో కలిసి సంతోషించేవారు, మనకి జ్ఞానమిచ్చేవారు, మనకి సహాయం చేసేవారిని బట్టి కూడా కృతజ్ఞతలు చెల్లించాలి. ప్రతి పరిస్థితిలో ప్రార్థన యొక్క భాగ్యాన్ని అభ్యసించుట నేర్చుకొనవలసి యున్నది. ఆయన మనకు చేసిన వాటన్నిటి నిమిత్తం, ఆయన మనకి ఇచ్చు వాటన్నిటిని బట్టి ఎల్లప్పుడూ వందనములు చెల్లించవలసి ఉన్నది. మన జీవిత క్రమములో కృతజ్ఞతాస్తుతి నిరంతరంగా ఉండునట్లు చూచుకొనుట ఒక భాగమై యున్నది.

సేకరించబడింది (ఇంకా ఉంది)

# మెగిద్దోలోయ




మెగిద్దో (గుంపులు కూడు స్థలము). ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వాధీనము చేసికొనక ముందు ఇది కనానీయుల వశములో ఉండెను. యెహోషువ కాలములో ఇశ్రాయేలీయులు కనాను దేశమును జయించినను వారు మెగిద్దో నుండి కనానీయులను వెళ్ళగొట్టి యుండలేదు. న్యాయాధిపతుల కాలములో బారాకు, దెబోరా అనువారు కనానీయులకు రాజైన సీసెరాను ఇచట ఓడించిరి

రాజైన అహజ్యాను యెహూ ఇచ్చటే వధించెను.

మంచి రాజైన యోషీయా ఇచట ఐగుప్తీయుల రాజైన ఫరోనెకో చంపివేసెను. అందువలన ఇశ్రాయేలీయులకు గొప్ప దుఃఖము కలిగెను. మరియు లోకాంతమునకు ముందు భక్తులకును, దుష్టులకును గొప్ప పోరాటము కలుగు చోటునకు హార్మగెదోను అను పేరు పెట్టిరి (హార్ – భూమి, మగెదోను – మెగిదో)

అష్షూరు నుండి ఐగుప్తుకు దండయాత్ర చేయు వారందరును ఈ మార్గములోనే ప్రయాణించవలసి ఉండెను. కీషోను నదిలో పడు ఒక యేరు దాని దగ్గరగా ఉండెను గనుక ఆ నది మెగిద్దో కాలువలు అనబడెను.




# బైబిల్ క్విజ్ -31

బైబిల్ గురించి ఆసక్తికరమైన అసాధారణ సత్యాలు

మీకు తెలిస్తే మాకు వ్రాయండి

**1.** స్వంత కొడుకుని ఉడకబెట్టుకుని తిన్న స్త్రీ అని ఎక్కడ పేర్కొనబడినది?

**2.** 88 మంది పిల్లలు గల తండ్రి ఎవరు?

**3.** ఒక మనిషి తన చేతులు పైకి ఎత్తినందున గెలిచిన యుద్ధం?

**4.** బలులు ఎన్ని రకాలు? ఎక్కడ చెప్పబడింది?

**5.** ఇశ్రాయేలీయుల పండుగలు ఎన్ని? ఎక్కడ పేర్కొనబడింది?

**6.** బైబిల్‌లో మధ్యలోనున్న పుస్తకమేది?

**7.** స్త్రీల పేర్లతో పేర్కొనబడిన రెండు పుస్తకాలేమిటి?

**8.** ఒక గాడిద మనిషితో మాట్లాడింది ఎక్కడ ఉంది?

**9.** ప్రార్థించినందుకు పదిహేనేళ్ళ ఆయుష్షు పొడిగించబడిన వ్యక్తి?

**10.** బైబిల్‌లో మొత్తం ఎన్ని పుస్తకములు? పాత నిబంధన ఎన్ని? క్రొత్త నిబంధన ఎన్ని?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిసెంబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి 2014 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ – దేవుని స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1 శాంతి నగర్, వాటర్‌ట్యాంకు ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 70,

**<u>బైబిల్ క్విజ్ – 30 జవాబులు</u>**

**1.** మెతూషెల (ఆది 5:27)

**2.** 40 మంది 1600 సం॥కాల వ్యవధిలో

**3.** యోహాను (మత్తయి 3:4)

**4.** 1,189 అధ్యా, పాని॥929, క్రొత్త ని॥260

**5.** యాకోబు (ఆది 28:11)

**6.** బైబిల్

**7.** రెఫాయీయుల సంతతివాడు (2 సమూ 21:20)

**8.** కీర్తన ॥117,119

**9.** (గిద్యోనుసైన్యము) న్యాయా 7:5

**10.** యెహోషువ 10:13

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## నవంబర్ - డిసెంబర్

**భాగ్యలత** : సత్యవతి, శ్రీలక్ష్మి, సుధజ్వాల, రూతు, సరళ, విజయలక్ష్మివర్మ, జానకి, శారద, విష్ణు, ఉదయ్, అనిష్‌ప్రశాంత్, భానుప్రకాష్, చంద్రసాయి, గౌతమి, వనితారాణి, వాసన్, సాయికిరణ్, హైమ, ఈశ్వర్రావు, భాను, ఎలిజబెత్, మౌనిక, ఎలీషా, నిఖిల్‌సూరజ్, మాథ్యూస్, రమణమ్మ, రామకృష్ణ, శ్వేత, కుమారి, స్ఫూర్తి, సుకేషిణి, భవ్యదీపిక, గీత, లోవప్రసాద్, శౌర్య, మహేంద్ర, ప్రసన్న, శృతి, అవినాష్, ప్రేమ్‌కుమార్, సాల్మన్‌రాజు, అక్షయ, హేమంత్‌కుమార్, జ్యోతి, సురేందర్, అనిల్‌బాబు, అశ్వని, విజ్ఞత, సత్యదుర్గసుప్రజ, కార్తిక్, దుర్గేష్‌నందిని, శారమ్మ, విజయలక్ష్మి, సుజాత, సృజన, రాంబాబు, మాధవి, బాలజ్యోతి, అవినాష్, శ్రీకాంత్, శిరీషభాను, కిన్నెరమేరి, భాగ్యలక్ష్మి, చంటిబాబు, నవీన్, శోభారాణి, గౌతమి, సుధారాణి, హెప్సిబా, మణి, మేఘన, రాధిక, ప్రజ్ఞ, ప్రవీణ్, ప్రవల్లిక, అభిషేక్, కనికరమ్మ, రూప, థామస్, రమేష్, తర్షినా, రాజ్‌కుమార్, సతీష్‌బాబు, అమూల్య, చంద్రకళ, పుష్పలత, రాధిక, లూధియ, సతీష్, నవీన్, కరుణ, కృష్ణవేణి, ప్రవీణ్, ఆశీర్వాదమ్మ, దివ్యజ్యోతి, అనిష్‌ప్రసాద్, ఫిన్నీనోయల్, భవ్యదీపిక

**చింతల్** : రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, కుమారి, పావని వెంకటేశ్వర్రావు, నాగేశ్వర్రావు, సుహాసిని, దానియేలు, దివ్యజ్యోతి, సాల్మన్, ఎస్తేరురాణి, మంజుల, లక్ష్మారెడ్డి,

**అనాజ్‌పూర్** : థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్, మారియమ్మ

**ఇ.సి.ఐ.యల్ :** ప్రేమ్‌కుమార్.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



అక్టోబర్ 2 ఉపవాస ప్రార్థనలో ఆత్మతో సత్యముతో
దేవుని ఆరాధిస్తున్న సహోదర సహోదరీలు.

# అన్నామణి

ఐర్లాండ్ దేశములోని మార్కెట్ హిల్ అను పట్టణమునకు సమీపమున నున్న బల్లమకల్లి అను మారు మూల గ్రామము నందు 1810వ సం॥లో **అన్నామణి** ఆరు మంది సంతానములో మూడవ దానిగా జన్మించెను. ఈమె తండ్రి జేమ్స్‌ప్రెస్టన్. ఈయన పొలములో బంగాళదుంపలు పండించుచూ, పందుల మందను కాయుచు శక్తి వంచన లేకుండా ప్రయాసపడుచుండెడి వాడు. ఈమె నీమెమెక్ అను ఆమె ఇంట పని చేయుచూ, దైవభక్తి కలిగిన వారి సహవాసమును కలిగి ఉండెను. ఆర్మ్‌స్ట్రాంగ్ హాలిడే అను ప్రసంగీకుని ప్రసంగము ద్వారా జీవితమును మార్చుకొని, దేవుని కృప కొరకు ప్రార్థించెను. పిమ్మట దేవుని యొక్క సిలువ దర్శనము ద్వారా రక్షించబడి అనుభవ సాక్ష్యమును అందరితో పంచుకొను చుండెను. అక్షరములు కూడా రాని బలహీనురాలైన ఆమె దేవుని సహాయం ద్వారా మొట్టమొదటిగా బైబిలు చదివెను. శరీరమందును, మనస్సునందును, ఆత్మయందును పరిశుద్ధపరచబడుటకు అపేక్షను కలిగి, ముఖ్యముగా సులువుగా చిక్కుల బెట్టు పాపములైన కోపము, మత్సరము, క్రోధము వంటి వాటి నుండి జయించుటకు పోరాటమును కలిగి ఉండెను. ఈమె దేవుని వాక్యానుసారముగా జీవించుచూ ప్రతీ విషయమునకు దేవుని సహాయమును కోరుచూ ఉండెను.

అన్నామణి తన యౌవన కాలములో పరిశుద్ధముగా జీవించునట్లుగా ఆత్మ వలన శరీరమును లోపరుచుకొనెను. అనేక పర్యాయములు దుష్టులు ఆమె కన్యత్వమును దోచుకొనవలెనని ప్రయత్నించిననూ దేవదూతలు వచ్చి ఆమెను రక్షించినవా అన్నట్లు ఆమె తప్పించబడుచుండెను. ఈమె తన సాక్ష్యమును ప్రసంగముల కంటెను, తన జీవితము ద్వారా ఎక్కువగా బోధించెను. ఈమె సంఘనాయకులకు, పాదుర్లకు సహాయ కారియై వారిని పై మెట్టునకు లాగుచుండెను. ఈమె జీవితము వారికి సవాలుగా ఉండెను. 96 సం॥లు స్వార్ధము లేకుండా జీవితాంతము వరకు పరిశుద్ధాత్మ దేవుని యొక్క నడిపింపును కలిగి, సంతోష, సమాధానములను, విజయమును జీవితములో అనుభవించెను.

అనేకుల బాధలలోనూ, సమస్యలలోనూ ఆదరణను కలుగజేసి, ఉన్నతమైన సేవ చేసి దీర్ఘకాలము జీవించి దేవుని బిడ్డల వలన సేవింపబడి జూన్ 21, 1906 వ సం॥లో మరణించింది. ఈమె యొక్క ఆత్మ వెలుగు తన చుట్టూ ఎన్నో మైళ్ళ వరకు వ్యాపించి సాతాను రాజ్యమును పడగొట్టెను.

ఈమె జీవితమును చూడగా ఎంత విద్యలేని వారైనను దేవునికి సంపూర్ణముగా అప్పగించుకొన్న యెడల బహు ఉన్నత పరిశుద్ధ సేవచేయ సామర్థ్యత దేవుడిచ్చెనని మనము చూచుచున్నాము. ఇది నిత్యజీవము నుండి వచ్చి నిలిచి యుండే సేవ.


## ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras